# సేద్యం కన్నా పద్యం గొప్పదా?

నర్సిమ్మారెడ్డి సేద్యం సేస్తావుంటే నలుగురూ నిలబడి సూసేవాళ్ళంట. తలకు టువాల సుట్టి, వొల్లె పైకెగజెక్కి, సెలకోల బుజాన యేసుకోని, ములుగట్టె సేత బట్టుకోని ఆయప్ప 'అద్దద్దా' అని ఎద్దుల్ని అదిలిస్తే, బూమితల్లి పులకరిచ్చి పోయేదంట. తెల్ల వార్జామున ఆయప్పగానీ సేద్యానికి పోయినట్టు తెలిస్తే, ఏ సేనికి పోయినాడో కనుక్కోని వూళ్ళో అయిదారుగురన్నా ఆదేపనిగా పని సెడగొట్టుకోని ఆడికిపోయి, ఆయప్ప సేద్యంసూస్తా కూచ్చొనేవాళ్ళంట.

మల్లా మనిసెంతుండె.... పిట్టంతోడు! ఆ పిట్టంత మనిసీ సేలో మడక దించి పిడికిడ్తో మేడితోక పట్టుకున్నాడా... ఏనిగంత ఎద్దులయినా ఎగరొప్పుల్తో ఇగ్గాల్చిందేనంట. పట్టుబట్టి మేడి బిగబడ్తే పిటపిటలాడిపోయి కొమ్ములు కాడికేసి కొట్టుకుంటా ఎద్దులు నిల్చిపోవాల్సిందేనంట. సూసేవాళ్ళు అచ్చెరపోయి "యాడుండాదబ్బా నీకింత బలం?" అనడిగితే, పిల్లోనాల నగేవాడంట. నగి "బలం గాదురా అబ్బీ పనితనం, సేతి వొడుపు" అని సెప్పేవాడంట.

ఎండాకాలం సేద్యాలకూ, ఏరువాక సేద్యాలకూ మల్లా ఆయప్ప పోయేవాడే కాదంట. అరగొర పదును గాక మెత్తని పదునయితే మాత్రం అప్పుడు యిత్తనం గొర్రు పట్టేవాడంట. ఇత్తనం అంటే గ్యాపకమొస్తాంది - ఊళ్ళో అందరూ ఇత్తనాలకు పోయేతప్పుడు ఎంత బాగుంటాదని ! ఇత్తనాలకు పోయేతప్పటికి అంతకు ముందు వానలు కుర్సి ఎద్దులకూ మనుషులకూ పనులు ల్యాకపోయుంటాయి గదా, అందువల్ల ఎప్పుడెప్పుడు సేలల్లోకి పోదామా అనుంటాది. ఆడోళ్ళు ఎద్దుల మొకాల మీద, సెండ్ల మీద కుంకం సల్లుతారు. ఇత్తనానికి పోయే మనుసుల నొసట్న బొట్టు పెడ్తారు. కాడి మీద గొర్రు బిగిచ్చినప్పుడో, సేలో గొర్రు దించినపుడో టెంకాయ గూడా కొడ్తారు.

ఇంటింటి ముందునా కాండ్లు గట్టుకుంటా, కోటేర్లు బిగిచ్చుకొంటా, ఇత్తనం కాళ్ళు సెనిక్కాయ పప్పుల మూటెల్ను బండ్ల కెత్తుకొంటా, మీరే సేనికంటే మీరే సేనికని అడుక్కుంటా.... నగుకుంటా, అంతా బలే సంబరంగా యాదో తిన్నాలకు బోతావున్నెట్టో, ఇంటింట్లో పెండ్లి అయితా వున్నెట్టో వుంటాదిలే. అప్పుడు సూస్తే.... యాటా ఇట్టనే ఇత్తనాలు ఏస్తావుండాము, కరువు వొస్తా పైరు ఎండిపోతా వుంది అనేది వాళ్ళకు గ్యాపకమే రానట్టు వుంటాది. ఇండ్ల ముందు ఇట్టుంటాదా, ....... ఊరిముందుకు పోయిగానీ సూస్తే అన్ని దావలా ఇత్తనం కాండ్లు సేలల్లోకి కదిలి పోతాంటాయి. కన్నూపు మేర్నా ఏ సేలో సూసినా ఎద్దులూ, మనుసులూ ఇత్తనం పనీ !

నర్సిమ్మారెడ్డి గొర్రు దోలేందుకు దిగినాడంటే, ఇత్తనాల వొడి మంగల ఎంగట్రాముడు కట్టుకోవాల్చిందేనంట. ఎంగట్రాముడు ఏడాదంతా గడ్డాలూ నెత్తులూ గొరుగుతావుండి, నర్సిమ్మారెడ్డి ఇత్తనం గొర్రుపడ్తే తానూ నెత్తికి రుమాలు సుట్టి వొడి కట్టుకొంటాడంట. వొయిసు పిల్లోళ్ళు ఎంగట్రాముడు నెత్తి బాగ గొరగలేదని వద్దంటే, పెద్దోళ్ళు ఎట్టనోకట్ట గొరగమని కూచ్చొనేవాళ్ళంట. ఏదైనా నట్టం వచ్చే సంగతి సెప్పడానికి "ఎంగట్రామునితో నెత్తి గొరిగిచ్చుకొని పోవాల్సిందే" అని ఇప్పటికీ అంటావుంటారు. ఊళ్ళో పెండ్లి అయ్యేటప్పుడు మేలానికి వచ్చినాడంటే.... పాటా లేదంట, పాడూ

1) ఇత్తనం వేసే పనిముట్టు

లేదంట, దవళ్ళు ఉబ్బిచ్చి 'ఓ.....' అని ఏడ్సినట్టు బూరగ ఊదేవాడంట. అప్పుడొకేటు ఇప్పుడొకేటు డోలు మీద దబా దబామని కొట్టేవాడంట, అంతే!

అట్టాటి ఎంగట్రాముడు అరుసెక్కల[2] గొర్రుకు ఒంటి జడిగెం[3] మీద రెండు సేతులా యిత్తేవాడంట! పొద్దుపొడిసిన కాన్నుంచీ పొద్దు గూకేదాంకా ఒకరు గొర్రూ ఒకరు వొడీపట్టి నర్సిమ్మారెడ్డి, ఎంగట్రాముడూ ఇత్తనం యేయడం సూస్తే.... కురుచ్చేత్రంలో కిష్ణుడూ, అర్జనుడూ యిట్టనే యుద్ధం సేసినారేమో అనిపిచ్చేదంట. ఇద్దరూ ఒకర్నొకరు ఎచ్చరిచ్చుకొంటా, ఎగతాలి సేసుకొంటా వుండేవాళ్ళంట. సేలో గొర్రును ఆ గెట్టునుంచీ ఈ గెట్టుకు అసు పోసినట్టు నడిపిస్తానే ఒకరి పనితనం మీద యింగొకరు సవాళ్ళు జేసుకొనే వారంట. జడిగెం ఆరు సెక్కల్లో యిత్తనాలు ఒకే లెక్కన పడలేదనీ, పైరు ఒల్లెడి[4] పొర్తాందనీ అనిపిస్తే "ఎంటికెలు గొరిగేవాడు ఇత్తనాలు వొడిగడ్తే అయ్యేదేనా?" అని నర్సిమ్మారెడ్డి అనేవాడంట. గొర్రు పట్టెకూ పట్టెకూ నడమగడ్డ ఎక్కువపోతావున్నెట్టు అనుమానం వస్తే "సేనంతా గడ్డలే, పోనీ నాకేం ? నాదా సేను ? ఎన్నడెక్కని రెడ్డి గుర్రమెక్కితే ఎనకో, ముందో నంట" అని ఎంగట్రాముడు ఎదురుదెబ్బ తీసే వాడంట.

పైరు మొల్చినాక సూస్తే ఆ గొర్రు సాల్లంత సక్కంగా కాయితం మీద గీత కూడా గీయలేరంట ! కొల్తలు యేసుకొని నాట్నా అంత కచ్చితంగా మొలక మొలకకూ నడమ ఒకే మొయిన వుండేట్టు నాట్తారా, అనేట్టు వుండేదంట పైరు ! ఇంగ జొన్న ఇత్తనం అయితే ఇద్దరికీ ఆట్లాటేనంట.... జొన్న ఇత్తనం అయిపోతానే.... ఆ సాల్ల నడమనే మల్లా గొర్రు నడిపి ఉలవ ఏసే వాళ్ళంట, గొర్రు సెక్కకూ సెక్కకూ నడమ అడుగు దూరముంటాదా, ఆ అడుగు దూరంలోనే మళ్ళా యింగో సాలేసి, యింగో పైరు ఏసేవాళ్ళంట. ఇదంతా సెప్తే తెల్దు. కండ్లతో సూసినా తెల్దు సేద్యం సంగతి తెల్చినోళ్ళకు తెల్చుతాది. సేలో ఇవతలి మార్న[6] గొర్రు కొమ్ము నెంబర్రాయికి సోకుతావుండేట్టు నిలిపి, కండ్లు మూసుకుని ఎద్దుల్ని తోలి సేను అవతలి మార్న నెంబర్రాయికి మల్లా అదే గొర్రు కొమ్ము తాకేట్టు గొర్రుతోల్నాడంట నర్సిమ్మారెడ్డి. ఒక్కోసారి ఎద్దులకు పగ్గాలూ,[7] పట్టెల్లు ల్యాకుండానే తోల్నాడంట. ఇట్ట సేద్యంలో ఎన్నెన్నో గొప్ప పన్లు సేసినోడంట ఆయప్ప.

ఇప్పుడు ఆయప్ప సేద్యం మానేసినాడు. ఇంటికాడ కూకొని పొద్దుపోక ఏయో పద్యాలు రాసి అచ్చేయిచ్చు కొన్నాడు. అయి రాసినందుకు ఆయప్పకు పెద్ద పేరొచ్చె. పొద్దుటూరు, కడప, ఇంగా శానా సోట్ల సబలు పెట్టి ఆయప్పకు గౌరవం సేసిరి. ఆయప్పకు గౌరవం సేసినందుకు బాదలేదుగానీ, అంతగొప్ప సేద్యెం సేస్తే రాని గౌరవం ఆరోన్ని పద్యాలు రాసినందుకు రాడమే సిత్రం. కాయితం మీద పద్యాలు రాయడంకన్నా నోరులేని గొడ్లను పట్టుకొని నేలమీద అంతగొప్ప సేద్యెం సేయడమే ఎంతో గొప్ప. మాంచి ఏటుకాడైన ఏసోబు, ఇత్తనం కాడైన ఎంగట్రాముడు వాళ్ళంతా గొప్పోళ్ళు గాదా! యీళ్ళను యెందుకు గౌరవిచ్చరు?

పోనీ, ఆ కడప, పొద్దుటూర్లలోని సదువుకొన్నోళ్ళకు సేద్యం సంగతి తెల్దనుకొందాం, నర్సిమ్మారెడ్డికి బాగా తెల్చుగదా! అయప్ప గూడా యిప్పుడు తను పద్యాలు రాయడమే గొప్పనుకుంటాన్నెట్టుంది. అదే అచ్చెర్యం.

---

2) అరుపాదాల 3) ఇత్తనాలను వదిలేది 4) పైరు సమంగా లేకపోవడం

5) అటు వెళ్ళి ఇటు రావడానికి 6) గట్టున 7) ఎద్దు మెడను కాడితో కలిపే తోలు పరికరం